


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు ‘చిన్నా’ భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

# (గత సంచిక తరువాయి)

మర్నాడు ఆ ఉత్తరాన్ని మామగారి పేర పోస్ట్ చెయ్యటానికి భర్తకి ఇస్తూ, సిగ్గు పడింది శారద. సుబ్బారావుకి అర్థమయ్యింది కాదు.

"ఈ ఉత్తరం అందగానే అత్తయ్యగారు, మామయ్యగారు రకామని వచ్చేస్తారు" అన్నది నునుసిగ్గుతో.

"అబ్బో, అంత గొప్ప ఉత్తరమా? ఏమున్నదో ఇందులో?" అడిగాడు కుతూహలంగా.

"వచ్చాక వారినే అడగండి." ఏదో పని ఉన్నట్లు అక్కడనించి వెళ్ళిపోయింది శారద ఒక్క పరుగున. సుబ్బారావుకి విషయమేదో అర్థమైనట్లే అనిపించింది. బుడ్డీ దీపం వెలిగించి పడకటింట్లోకి తెచ్చిన సుబ్బారావు, భార్య మొహం వెలిగిపోతుండటం ఆ దీపపు కాంతిలో గమనించాడు.

"భోజనానికి రండి" పిలిచింది శారద

"విషయమేమిటో చెప్పవచ్చుగా?" అనురాగంతో అడిగాడు సుబ్బారావు

"మీకే తెలుస్తుంది లెండి." శారద కొంటెగా అని వెళ్ళిపోయింది, "పిల్లలూ భోజనానికి రండర్రా" అంటూ.

మరో పదిహేను రోజుల్లో జవాబొచ్చింది సుబ్బమ్మగారి నుంచి, తాము ఆనెల పదో తేదీన బయల్దేరి వస్తున్నట్లు. ఆ శుభవార్తను ఊరి వారందరితో పంచుకుంది శారద. ఊరు ఊరంతా సంతోషంలో మునిగి పోయింది.ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని వెనక్కి వస్తున్న ఆ దేశభక్త దంపతులకు స్వాగతం చెప్పడానికి ఊరంతా అలంకరించారు.

## 16

ఆ రోజు ఒక పండుగ లాగా ఉన్నది ఆ ఊరి జనాలకి. ఊరి మధ్యలో లైబ్రరీ దగ్గర తాటాకు పందిరి వేసి రంగు రంగుల తోరణాలు కట్టారు. మైకు పెట్టి దేశభక్తి గీతాలు వినిపిస్తున్నారు. అందరికి ఎంతో ఇష్టమైన

"వీరగంధము తెచ్చినారము

వీరుడెవ్వడో దెల్పుడీ

పూసిపోదుము, మెడను వైతుము

పూలదండలు భక్తితో"

"మేలుకో సాగిపో–బంధనాలు తెంచుకో

బరువులూ, బాధలూ– అందరితో పంచుకో

దేశాన్ని దోచుకునే తెల్లవాణ్ణి తరిమి

జైళ్ళలోని వీరులను నేడే విడిపించుకో "

వంటి పాటలైతే ఎన్నిసార్లు వినపడ్డాయో లెక్కే లేదు. పందిరికింద రంగవల్లులు తీర్చి దిద్దుతున్న ఆడవాళ్ళు ఎలుగెత్తి ఆ పాటలతో శృతి కలిపి పాడుతున్నారు. మంగళ వాయిద్యాల వారు సిద్ధంగా ఉన్నారు. కొంతమంది మంగళ హారతి సిద్ధం చేసుకుంటున్నారు. మొత్తం మీద ఒక పండుగ వాతావరణం నెలకొంది ఆ వూరిలో. అది ఇప్పటి తరం వారు ఎరుగని పండుగ. ఊరు ఊరంతా ఒక్కటై చేసుకునే దేశ భక్తుల పండుగ.

పొద్దుటినుండి ఎదురుచూస్తున్న వారి వీనులకు విందుగా మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఊరి బయట నుంచి జయజయధ్వానాలు నింగినంటాయి." కేశవరావు గారికి జై, సుబ్బమ్మగారికి జై, భారత మాతకీ జై" అంటూ. ఊరి జనమంతా ఒక్కసారిగా ఆ శబ్దం వస్తున్న వైపు పరుగులు తీశారు.

అప్పటికే సుబ్బమ్మ, కేశవరావు గార్లకు ఎదురెళ్ళి దండలు వేసి తీసుకు వస్తున్నారు కొందరు. అదో పెద్ద ఊరేగింపు. కనుల పండుగగా ఉంది. దంపతులిద్దరూ పార్వతీ పరమేశ్వరుల లాగా మెరిసిపోతున్నారు. సుదీర్ఘ ప్రయాణం తాలూకు అలసట వారిలో కనిపిస్తున్నా, ఊరి వారి ఉత్సాహానికి అడ్డు చెప్పట్లేదు. వాళ్ళు గ్రంథాలయం దగ్గర కొచ్చేసరికి మేళాల జోరు మిన్ను ముట్టింది. ఎఱ్ఱ నీళ్ళు దిగతుడవటం, మంగళ హారతులిచ్చి వేదికపైకి ఆహ్వానించటం, దండలు వేయటం వరుసగా జరిగి పోయాయి. అది చూస్తున్న ప్రతి వారిలో దేశభక్తి ఉప్పొంగుతోంది.

ముందుగా వేదిక నెక్కింది పసిబిడ్డను చేతిలో పెట్టుకుని సుబ్బమ్మగారి కూతురు హైమవతి, అల్లుడు పార్వతీశం, వారి మిగిలిన పిల్లలు. వారి వెనుకే కోడలు శారదతో పాటే కొంచెం వెనుకగా పెద్దకొడుకు సుబ్బారావు, అతని వెనుకగా అతని తమ్ముళ్లు వేదిక నెక్కారు. కళ్ళ నిండా నీళ్లతో తల్లిదండ్రులకి నమస్కరించింది హైమవతి బిడ్డను వారి చేతులకు అందిస్తూ. ఎంతో సంతోషంగా ఆ పాపను "దీర్ఘాయుష్మాన్ భవ" అని దీవించారు ఆ పుణ్య దంపతులు.

ముగ్గురు కొడుకులు వచ్చి అన్నా వదినలతో కలిసి తల్లిదండ్రుల కాళ్లకు భక్తితో నమస్కరించారు. వాళ్ళని ఆనందంగా దగ్గరకు తీసుకున్న సుబ్బమ్మగారి కళ్ళవెంట నీళ్లు తిరిగాయి.

"చిన్ని నాన్నలూ, వదిన మాట వింటున్నారు కదా? నేను లేనప్పుడు వదిన మాట నా మాట లాగానే వినాలి. పెట్టింది తినాలి, చెప్పింది చేయాలి. సరేనా? ఇక మీదట ఆమే మీ అమ్మ అనుకోండి "

"అయ్యో, అత్తయ్య గారూ, వాళ్ళు నా మాట చక్కగా విన్నారు. బంగారు తండ్రులు. నేను కనకుండా దొరికిన కొడుకులు వాళ్ళు," శారద వెంటనే అన్నది.

సుబ్బమ్మగారు ఆపేక్షగా కోడలిని దగ్గరకు తీసుకుని గద్గద కంఠంతో అన్నారు "నాకు తెలుసు శారదా, నువ్వుండగా వాళ్ళ గురించి నాకు దిగులెందుకు? ఒంట్లో ఎలా ఉంటోంది?" వెంటనే సిగ్గుతో శారద బుగ్గలు ఎర్ర బడ్డాయి.

"బాగుంటోంది అత్తయ్యగారు," వినయంగా జవాబిచ్చింది. కేశవరావుగారు కొడుకు భుజం మీద తట్టారు అభినందన సూచకంగా.

ఈ లోగా సభ ప్రారంభమవబోతోంది కనుక అందరూ నిశ్శబ్దంగా ఉండాలని మైకులో హెచ్చరిస్తుండటంతో సుబ్బమ్మగారు, కేశవరావు గారు తప్ప మిగిలిన వాళ్ళందరూ వేదిక దిగారు.

ఆ ఊరి పెద్ద రామలింగేశ్వర రావు గారు సభను ప్రారంభించి కేశవరావుగారిని ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న జ్ఞాపకాలను తమతో పంచుకొమ్మని కోరారు. ఆయన కుర్చీ లోంచి లేచి మైక్ అందుకున్నారు.

ఇంతలో మూగిన ఆ అశేష జనం వెనుకనుంచి పోలీసు వాను చప్పుడు వినిపించ సాగింది. ఉన్నట్టుండి ఎక్కడ నుండి వచ్చారో బ్రిటిష్ పోలీసులు, ఏ ద్రోహి సమాచారం ఇచ్చాడో, ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. అప్పటి వరకు ఒక్కసారి కూడా అటువంటి సంఘటన జరిగి ఉండక పోవటంతో అందరూ ఆదమరచి ఉన్నారు.

వెనుక నుంచి వస్తూనే "లీవ్ దిస్ ప్లేస్,"అని అరుస్తూ జనాన్ని చెల్లా చెదురు చేయటానికి ప్రయత్నం మొదలు పెట్టారు. వారికి నాయకుడిగా కనిపిస్తున్న వ్యక్తి "వీ అర్ గోయింగ్ టు అరెస్ట్ దెమ్. గో అవే, " అని గట్టిగా అరిచాడు.

ఆ ఊరి ప్రజలలో మూడొంతుల మందికి ఇంగ్లీష్ అర్థం కాదు. కానీ వాళ్ళని చూడగానే, వాళ్ళు కేశవరావు, సుబ్బమ్మగార్ల కోసం వచ్చారని గ్రహించారు వారు. గోల గోలగా వారిని చుట్టు ముట్టారు.

"దే ఆర్ టేకింగ్ పార్ట్ ఇన్ యాజిటేషన్స్ ఎగైనెస్ట్ ది బ్రిటిష్ గవర్నమెంట్, వీ అర్ అరెస్టింగ్ దెం. యూ పీపుల్, గెట్ లాస్ట్!" అన్నాడు వాళ్ళ నాయకుడు కఠినంగా. జనానికి వాళ్ళేమి చేయబోతున్నారో అర్థమయ్యింది.

"కేశవరావుగారిని బంధించడానికి వీలు లేదు,"అంటూ బ్రిటిష్ సైనికులకు అడ్డంగా వీధిలో పడుకున్నారు. ఇంతలో ఆందోళనగా వేదిక మీద నించి ఒక్క పరుగున వచ్చారు కేశవరావు గారు.

"దయచేసి మీరందరూ లేవండి. అనవసరంగా హింసాకాండకు తావివ్వకండి. గాంధీగారు చెప్పిన అహింసా సిద్ధాంతాన్ని మరువకండి." ఆయన మాటలు పూర్తి అవకుండానే వారందరిని దొరికిన వారిని దొరికినట్లు లాఠీలతో చితకబాద సాగారు బ్రిటిష్ పోలీసులు. ఒక పోలీస్ అటువైపు ఉన్న కేశవరావుగారి తల మీద తన లాఠీతో గట్టిగా కొట్టబోయాడు. అప్పుడే అక్కడకు చేరి, అది గమనించిన సుబ్బమ్మగారు ఒక్క పరుగున వచ్చి ఆయనను పక్కకు తోశారు. అంతే, ఆ లాఠీ దెబ్బ ఆవిడ తలను బలంగా తాకింది. తేరుకునేలోగా మరోవైపు నుంచి కేశవరావు గారికి గురిపెట్టబడ్డ మరో దెబ్బ అదే నిమిషంలో తలకు మరోవైపు తగిలింది. రక్తపు ధార మడుగులెత్తటంతో కుప్పకూలిపోయారు సుబ్బమ్మగారు. ఆవిడకు స్పృహ తప్పింది. చూస్తున్న జనాల సహనం తప్పి పోయింది. ఒక్కసారిగా బ్రిటిష్ సైనికులను తరిమి కొట్టసాగారు. ఈ గోలలో జరిగిన లాఠీ ఛార్జ్ లో బ్రిటిష్ వారు ఎంత మందిని గాయపరిచారో లెక్కే లేదు. కానీ ఒక్క భారతీయుడు కూడా వారిని గాయపరిచింది లేదు.

"స్వతంత్రం మా జన్మ హక్కు"

"రక్తాన్నైనా చిందిస్తాం, స్వాతంత్రాన్ని సాధిస్తాం"

"వందే మాతరం" వంటి నినాదాలు అక్కడ మారుమోగాయి. స్త్రీ పురుష విచక్షణ లేకుండా అక్కడ లాఠీచార్జి జరిగింది. అడ్డొచ్చిన వారి ఒంటి మీద లాఠీలు విరిగాయి. ఒంటిమీద స్పృహ లేని సుబ్బమ్మ గారి నెవరో పక్కకి తప్పించారు.

లాఠీ దెబ్బలకు వెరవకుండా బ్రిటిష్ పోలీసులనందరిని గ్రామ సరిహద్దులు దాటే వరకు తరిమారు గ్రామస్థులు. బ్రిటిష్ వారిని తరిమామని సంబరపడుతూ చూసుకునే వేళ్టికి కేశవరావు గారి జాడ లేదు. ఒక్కసారిగా భయపడ్డారు గ్రామస్థులు. అప్పటికి వారికి అర్ధమయ్యింది, పోరాటంలో గెలిచింది బ్రిటిష్ పోలీసులేనని. వారు వచ్చింది కేశవరావుగారి కోసం. ఆయనను తీసుకు పోయారు! అంతేకాక గ్రామం మొత్తానికి మాతృమూర్తి అయిన సుబ్బమ్మగారిని ప్రాణాపాయ స్థితిలోకి నెట్టి వెళ్ళారు!

అందరు ఒక్క పరుగున సుబ్బమ్మ గారి దగ్గరకు వచ్చారు. అంతకు కొన్ని గంటల ముందు కళకళ లాడుతున్న ఆమె మొహం రక్తసిక్తమై ఉన్నది. మోచేతుల వద్ద చెయ్యి విరిగి వేళ్ళాడుతోంది. పాదాలు నీలి రంగులోకి తిరిగాయి.

బూట్లతో పోలీసులు తొక్కారో ఏమో. అందరూ చుట్టు ముట్టి ఉండగానే అంతగా ఆమెను ఎలా గాయపరిచారో వారు! శ్వాస తీసుకునేందుకు కూడా శక్తిలేక రొప్పుతున్నారు ఆవిడ. ఆవిడనా స్థితిలో చూసి చెమ్మగిల్లని కన్ను లేదు.

అందరూ కలిసి ఆమెను ఇంటి లోపలకు మోసుకు పోయారు. హైమవతి ఏడుస్తూ ఒక్క పరుగున లోపలకు వెళ్ళి నీళ్లు తెచ్చి మొహం మీద కొట్టింది. సుబ్బారావు ఆమె తలను తన ఒడిలో పెట్టుకుని కూర్చున్నాడు. తల పగిలిన దగ్గరనుంచి కట్టు కట్టినా రక్తం వస్తూనే ఉంది. ఆమె స్పృహలో లేదు. వైద్యుడి దగ్గరకు తీసుకు వెళ్లాలని బండి సిద్ధం చేశారు.

కానీ వారికంత శ్రమను ఇవ్వనే లేదు సుబ్బమ్మ గారు. అక్కడే, కొడుకు వొళ్ళోనే ఆఖరిశ్వాస విడిచారు. జనమంతా హతాశులయ్యారు.

ఆమె మరణానికి ప్రకృతి కూడా నిరసన చూపిస్తున్నట్లు ఉన్నట్లుండి హోరుగాలులు మొదలయ్యాయి. ఊరిజనం మొత్తం అక్కడే ఉన్నారు. ఎవరు ఏడుస్తున్నారో, ఎవరు ఓదారుస్తున్నారో తెలియని పరిస్థితి అది. ఎవరు సుబ్బమ్మగారి కుటుంబ సభ్యులు? కేవలం కూతురు, అల్లుడు, నలుగురు కొడుకులు, కోడలేనా? ఎలా అవుతారు? ఊరిలోని పెద్దా, చిన్నా, ముసలీ ముతకా అందరూ ఆమెకోసం ఏడుస్తున్నారు కన్నీరు మున్నీరుగా! వారందరు ఆమె బిడ్డలేగా!

"సుబ్బమ్మతల్లీ, దేశానికీ స్వతంత్రం వచ్చేవరకు, రాముడు పిలిచినా రానని చెప్తానన్నావే? మరిచిపోయావా?" గుడి పూజారిగారు కన్నీరు పెడుతున్నారు.

"అమ్మా, సత్యాగ్రహం అయిపోగానే, మా అందరి సదువుకీ బడి పెట్టిస్తా నన్నావుగా తల్లే, ఏడకెళ్ళి పోనావు?" పాలు పోసే రంగయ్య కుమిలి పోతున్నాడు.

పూలమ్మే శాంతమ్మ పెద్ద గులాబీల దండ తెచ్చి సుబ్బమ్మగారి పైన వేసింది. ఊరంతా మరోసారి ఘొల్లుమంది ఆమె అప్పుడే పోయినట్లు. ఈ దుఃఖాన్నంతా చూసి భరించలేనంటూ సూర్యుడు పడమటి కొండల్లోకి దూకేశాడు. ఆ ప్రాంతాన్ని పూర్తిగా చీకట్లు కమ్ముకున్నాయి.

ఇరుగుపొరుగు వారు అక్కడ ఉన్నవారందరికీ తాగటానికి, తినటానికి ఏవో ఏర్పాట్లు చేశారు. కానీ వాటిని కన్నెత్తి చూసిన వారే లేరు. ఎవరో పెట్రోమాక్స్ లైట్ తెచ్చి పెట్టారు, సుబ్బమ్మగారి శరీరాన్ని వరండాలోనే ఉంచారు. చుట్టుపక్కల గ్రామాలకి కూడా వార్త పాకి పోయింది. ఎక్కడెక్కడి వారు చూడటానికి రాసాగారు. రాత్రి మొత్తం జనం వస్తూనే ఉన్నారు.

ఊరివారి సలహా మీద తెల్లవారే వరకూ ఆగి, తెల్లవారగానే, ఆ ఊరి పెద్దలను సహాయంగా తీసుకుని పోలీస్ స్టేషన్ కి వెళ్లారు పార్వతీశం, సుబ్బారావు. కేశవరావుగారు అక్కడ లేరు. కనీసం ఆయన్ను ఎక్కడకు తీసుకు వెళ్లారో కూడా తెలి–యదు. హతాశులయ్యారు ఇద్దరూ. పోలీస్ స్టేషన్ బయట ఊరి జనం మొత్తం కోపంతో రగిలిపోతు, కేశవరావుగారి రాక కోసం ఎదురు చూస్తున్నారు. పసిబిడ్డతో ఉన్న హైమవతి, గర్భవతి అయిన శారదల దుఃఖం చూస్తుంటే ఊరివారి రక్తం మరిగిపోతోంది.

"మనం వెళ్ళి నాలుగు తంతే వారే చెప్తారు." ఓ యువకుడు ఆవేశంగా అరిచాడు.

"ఇదేనా మనం నేర్చుకుంది? మన మార్గం అహింస కదా? నాన్నగారు హింస వద్దనే కదా చెప్పారు. గాంధీగారి బాట అదేగా!" సుబ్బారావు నచ్చచెప్పాడు. మిగిలిన అందరూ కూడా కలిసి ఆ యువకుడిని శాంతింపచేశారు.

పార్వతీశం మరొక్కసారి సుబ్బారావుతో కలిసి ఠాణా లోపలకు వెళ్ళాడు. కేశవరావు గారి భార్య మరణించిన విషయం చెప్పి, అంత్యక్రియలకు ఆయన ఉండాలని వేడుకున్నాడు.

ఆ పోలీస్ అధికారి వికటంగా నవ్వాడు. "ఇంకా ఆ ప్రభుత్వ ద్రోహిని తీసుకు వెళ్తూనే ఉండిఉంటారు, ఎక్కడున్నాడని చెప్పాలి? వాళ్ళని ఊరికి దగ్గరి జైళ్లలో ఉంచరు. ఉన్నచోటు ఇప్పటికి తెలియదు. ఎప్పటికి తెలుస్తుందో కూడా తెలియదు. కాబట్టి మీరు ఆమెను సాగనంపెయ్యండి."

అతను చెప్పిన మాటలలో వాస్తవ ముంది. సుబ్బారావు, పార్వతీశంలు వెనక్కి వచ్చేసారు.

ఆ మర్నాడు ఊరు ఊరు కదలి, వారి కూడా వెళ్లారు. సుబ్బమ్మగారి అంతిమయాత్రలో పక్క ఊళ్ళనించి వచ్చిన వారు కూడా పాల్గొని ఆవిడను కడతేర్చే వరకు ఉండిపోయారు. ఊరిబయట పారుతున్న కాలువ దగ్గర, పండు ముత్తయిదువగా అలంకరించి "భారతమాతకు జై "అని హోరెత్తే నినాదాల మధ్య సుబ్బమ్మగారి దేహాన్ని అగ్నికి ఆహుతి చేశారు. "అమరజీవి సుబ్బమ్మగారికి జై" అనే నినాదాలు అక్కడంతా హోరెత్తాయి.

తలకు కొరివి పెట్టిన సుబ్బారావు దుఃఖానికి అంతే లేదు. భార్య గర్భవతి అన్న ఆనందం ఆస్వాదించేలోగా ఇంత పెద్ద దుర్ఘటన జరగటం అతన్ని పూర్తిగా కుదిపేసింది, కృంగదీసింది. ఊరందరికీ అమ్మలాంటి తన తల్లి సుబ్బమ్మగారు హటాత్తుగా మరణించటం, పైగా తండ్రి జాడ తెలియక పోవటం, అతనిలో ఒక రకమైన వైరాగ్యాన్ని నింపాయి.

వైరాగ్యం మూడు రకాలంటారు. ప్రసూతి వైరాగ్యం, పురాణ వైరాగ్యం, స్మశాన వైరాగ్యం. ప్రసూతి వైరాగ్యం స్త్రీలకు కలుగుతుంది. పురిటి సమయంలో నొప్పులను భరించలేక ఎందుకొచ్చిన కాపురం, ఎందుకీ గర్భం, ఏమిటీ

నొప్పులు? నేనెందుకు పడాలి? నా మొగుడు కేవలం సుఖపడితే, బిడ్డను కనే కష్టం నాదా? కాపురం వద్దు, పిల్లలూ వద్దను కుంటారుట. కానీ బిడ్డ పుట్టగానే, ఆ పసిపాపను చూస్తూ పడ్డ కష్టం అంతా మరచిపోయి చంటి పిల్లకు పాలు ఇస్తూ మురిసిపోతారుట.

ఇక రెండోదైన పురాణ వైరాగ్యం స్త్రీ పురుషులిద్దరికి కలుగుతుంది. గతంలో అందరూ సాయంత్రపు వేళలలో గుడికి వెళ్ళి దేవుడి దర్శనం చేసుకునేవారు. ముఖ్యంగా బాధ్యతలు తీరిన పెద్దవాళ్లంతా మనవడినో, మనవరాలినో కూడా తీసుకుని సాయంత్రపు వేళలలో తప్పని సరిగా గుడులకు వెళ్ళి పురాణ శ్రవణం చేసేవారు. ఎందుకంటే అప్పట్లో ఇతర కాలక్షేపాలు ఏవీ ఉండేవి కావు. ఇల్లాళ్ళకు సాయంత్రం వంటపని ఉండే వేళ, ముసలి ముతక జనాలకు ఏమీ పని ఉండేది కాదు. అష్టాదశ పురాణాలను చదివిన పండితులు, పండిత పామర రంజకంగా అందులోని కథలను చెప్పేవారు. మనుషులు భూలోకంలో చేసే పాప పుణ్యాలు, వాటి ఫలితాలు వివరించేవాళ్ళు. ఈ ప్రపంచం మాయ అని, మనమందరం ఈ జన్మలోనే చుట్టాలమని, భవబంధాలు తెంచుకుంటే కానీ మోక్షం లభించదని వైరాగ్యం నూరి పోసేవారు. సాయంత్రం గుళ్లకు వెళ్ళి ఆ శాస్త్రిగారు చెప్పే పురాణాలను విని వైరాగ్యాన్ని వంట పట్టించుకునే పెద్దవారంతా, ఈ మమకారాలన్నీ వదిలించుకోవాలి. దేవుడు మనల్ని ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్ళి పోవటానికి సిద్ధంగా ఉండాలి అని తలపోస్తుండేవారు. వాళ్ళు ఇంటికి వచ్చే వేళకు ఇల్లాళ్ళు పని ముగించుకుని ఇరుగు పొరుగు ఆడవాళ్ళతో ముచ్చట్లతో ఉండేవారు. పెద్దవాళ్ళు, ఇంటికి వచ్చాక ఆ వేళ్టి పురాణ విశేషాలు ఇంట్లో వాళ్ళకి చెప్పి వైరాగ్యంతో ఇక ఇల్లు మీరే చూసుకోవాలి, మాకేమీ బాధ్యతలొద్దు అన్నట్లు మాట్లాడేవారు. అదే పురాణ వైరాగ్యం కానీ తెల్లవారాక మామూలే..

ఇక మూడవదైన స్మశాన వైరాగ్యం. చాలా కుటుంబాలలో ఆడవాళ్లు స్మశానానికి వెళ్లరు కనుక సాధారణంగా ఇది మొగవారికే అనుభవం. కట్టెలమీద ప్రాణం పోయిన కట్టెను చేర్చి కాల్చే వేళలో కాటి కాపరులకు అది ఒక తగలబెట్టవలసిన శవం లాగానే కనిపిస్తుంది కదా. ఎంత తొందరగా ఆ శరీరం తగలపడితే అంత తొందరగా వాళ్ళ బాధ్యత పూర్తి అయినట్లు. అందుకే వాళ్ళు దాన్ని తొందరగా తగల పెట్టడానికి చూస్తారు. ఒక్కోసారి కట్టెల వేడికి శరీరం పైకి లేస్తే కర్రతో దాన్ని కొట్టి పడుకో పెడతారు. కాళ్ళు పైకి లేస్తే వెనక్కి విరుస్తారు! ఇక పుర్రె పగిలి కపాల మోక్షం అయ్యేటప్పటి శబ్దం విన్న ఎవరికైనా వైరాగ్యం కలగక తప్పదు. ఇంతకాలం ఎంతో ప్రేమగా పోషించిన శరీరం చివరికి ఇలా తగల పడుతుందనే నిజం కళ్లెదుట కనిపిస్తుంటే ఎంతవారికైనా ఓ క్షణం గుండె గుభిల్లుమనక తప్పదు. అదే స్మశాన వైరాగ్యం. అయితే మాయ ఏంటంటే ఆయా ప్రదేశాల నుంచి బయటకి రాగానే మనిషి అన్నీ మరచి పోతాడు. తనంత వాడు లేడనుకుంటాడు. అలా కాకపోతే ఈ ప్రపంచం ఆగి పోతుంది కదా. సృష్టి ఎలా కొనసాగుతుంది? అదే మరి భగవంతుడి లీలా విలాసం.

మనతో పాటు అప్పటివరకు ఉన్న మనిషి కనిపించకుండా పోతే ఆ కష్టం, నష్టం అనుభవించే వాళ్ళకే తెలుస్తుంది. అందునా సుబ్బమ్మగారి లాంటి గొప్ప వ్యక్తి దాటిపోతే, ఆ నష్టం ఆ కుటుంబానికే కాదు, గ్రామం మొత్తానికీ. ఆ గ్రామంలోని వారందరికీ ఆమె తల్లి, గురువు, దైవం. మార్గదర్శి. వారిని స్వాతంత్ర సమరం దిశగా నడిపించే నాయకురాలు, బిడ్డలకి పెట్టినట్లు అన్నం పెట్టే అన్నపూర్ణ, ధన సహాయం చేసే లక్ష్మీదేవి. ఆమె భౌతికంగా దూరమై పోయినా వారందరి మనసులో ఒక స్ఫూర్తిగా నిలిచిపోతుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

17

**కే**శవరావు గారు ప్రజల కంటికి దూరమయ్యారు. ఆయన ఎక్కడ వున్నారో, ఉంటె ఎప్పుడు వస్తారో, అసలు ఉన్నారో లేరో, ఎవరికీ తెలియదు. దిక్కుతోచని పిల్లలు తండ్రి కోసం వెతుకుతున్నట్టు ఆ గ్రామ యువకులు కేశవరావు గారి గురించి వెతుక్కుంటున్నారు. సర్వత్రా ఆయన గురించిన ఆందోళన నెలకొని ఉంది. ఉన్నట్లుండి ఆ గ్రామ సంసారం తల్లిదండ్రుల వంటి వారిద్దరినీ పోగొట్టుకుని దిక్కులేని దయ్యింది. ఇది ఊహించని మలుపు.

శారద తల్లి కాబోతున్నందుకు ఎంత సంతోషించిందో, అంతలోనే తల్లివంటి అత్తగారిని కోల్పోయి అంతటి దుఃఖానికి గురి అయ్యింది. భర్త దిక్కు తోచని స్థితిలో ఉన్నాడు. మరుదులది ఎటూ కానీ వయసు. అటువంటి పరిస్థితులలో ఆమే ఆ ఇంటికి ఆధారమయ్యింది. పసిపిల్లతో హైమవతి నెల రోజులకు పైగా అక్కడే ఉండి పోయింది. అక్కడ మిగిలిన పిల్లలు ముగ్గురినీ కంటికి రెప్పలా కాపాడుతోంది శయనమ్మ. ఆవిడ ఇంటిని కనిపెట్టుకుని చూస్తోందన్న ధైర్యమే హైమను పుట్టింట్లో స్థిమితంగా ఉండేలా చేసింది. తల్లిని కోల్పోయి, తండ్రి ఎక్కడ ఉన్నాడో తెలి యక అల్లాడిపోతున్న అన్నదమ్ములని వదిలి ఆమె ఎలా వెళ్తుంది? తన దుఃఖం ఒక ఎత్తు. దానిని సంభాళించుకుని, వాళ్లకి అండగా ఉండటం ఇంకో ఎత్తు. ఆమె తన మనసులో పడుతున్న క్షోభ ఆమెకే తెలియాలి. ఆ సమయంలో పార్వతీశం ఆమెకి ఎంతో అండగా ఉన్నాడు. భార్యని కొన్నాళ్ళు అక్కడే ఉండమని, తాను వెళ్ళి మిగిలిన పిల్లలను చూసుకుని వస్తూ ఉండేవాడు. బావమరిదికి ఎంతో మానసిక స్థైర్యం ఇచ్చాడు. శారదను సొంత అన్నలా ఓదార్చాడు.

ఆ సాయంత్రం పార్వతీశం మళ్ళీ గుంటూరుకి వెళ్లాల్సి ఉండగా, ఒక సంఘటన జరిగింది. ఆ ఊరి బడిలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు సూరిబాబు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

బావగారూ, బావగారూ.. పెదనాన్నగారు వస్తున్నారు."

"ఎవరూ, మావగారే" నమ్మలేనట్లు అడిగాడు పార్వతీశం. ఔనన్నట్లు తలూపాడు అతను.

ఒక్కసారిగా అందరిలో ఆనందం.

"పెదనాయుడుగారు బండిలో తెస్తున్నారు. అచారిగారికి కబురు పంపారు," ఒక్కసారిగా అందరి గుండెలు గుభిల్లు మన్నాయి.

"ఆచారి గారు దేనికి?" ఆందోళనగా అడిగాడు సుబ్బారావు.

"పెదనాన్నగారి పరిస్థితి బాగోలేదు." అందరి గుండెల్లో రాయి పడినట్లయింది. ఒక్క ఉదుటున బయటకు పరిగెత్తాడు పార్వతీశం. అతన్ని అనుసరించాడు సుబ్బారావు. వారు వాకిట్లోకి వెళ్తుండగానే పెదనాయుడు గారి బండి వారి ఇంటి ముందు ఆగింది. అందులోంచి ఇంచుమించు చేతుల మీద దింపారు కేశవరావుగారిని. ఆయన మన ప్రపంచంలో లేరు. ఒళ్ళు జ్వరంతో పేలిపోతోంది. మనిషి బాగా చిక్కిపోయి ఉన్నారు. యోగా అభ్యసించి, పొద్దున్నే ధ్యానం చేసి, దైవిక తేజస్సుతో విరాజిల్లే మొహం ఇదేనా? మనిషిని చూస్తూనే ఎవరైనా చెప్పొచ్చు ఆయనకు ఎన్నో దినాల నుండి సరైన ఆహారం లేదని. ఆయనను ముందు వరండాలో గాలి బాగా ఆడే చోట మంచం వేసి పడుకోబెట్టారు. ఆయనతో కూడా వచ్చిన పెద నాయుడు గారు, ఆచారి గారు విషణ్ణ వదనాలతో ఉన్నారు.

"నాయుడు గారు, ఏం జరిగిందండి?" ఆక్రోశంగా అడిగాడు సుబ్బారావు

"నేను పనిమీద పెదనందిపాడుకి వెళ్ళి వస్తున్నాను.. ఊరి పొలిమేరకి వచ్చేసరికి పంతులుగారు తూలుతూ వస్తున్నారు. అక్కడికీ దూరం నుంచే ఆనవాలు పట్టి వెంకాయిని బండిని తొందరగా పోనివ్వమన్నాను. కానీ నేను ఆయనగారిని చేరేలోపే రోడ్డుమీద పడిపోయారు. అప్పటినించి ఇప్పటివరకు స్పృహ రానే లేదు. తిన్నగా ఆచారి గారి దగ్గరకు తీసుకు వెళ్ళాను.. ఎందుకైనా మంచిది, వారి ఇంటికే తీసుకు వెళ్దాం అన్నారు ఆచారి గారు. అందుకే నా బండిలోనే ఇటు తీసుకువచ్చాం " గొంతు తగ్గించి వివరించారు నాయుడు గారు.

"నేను చెయ్యగలిగింది చేశాను. ఇక పైవాడి దయ. మరో పదినిమిషాల్లో స్పృహ రావొచ్చు. అదే ఆఖరిసారి కావొచ్చు" నాడి చూసిన ఆచారి గారు విషాదంగా చెప్పారు.ఇంటిల్లి పాదికీ పై ప్రాణాలు పైనే పోయినట్లయ్యాయి. హైమవతి విసనకర్రతో కేశవరావు గారికి గాలి తగిలేలా వీస్తూ తల దిక్కున నిల్చుంది. సుబ్బారావు స్తంభాన్ని ఆనుకుని కూలబడి పోయాడు.

అందరూ కేశవరావు గారు స్పృహలోకి రావటానికి ఎదురుచూస్తున్నారు. శారద అక్కడకు వచ్చిన ఊరి పెద్దమనుషు లందరికీ మజ్జిగ తేవటానికి లోపలకు వెళ్ళింది దుఃఖాన్ని దిగమింగుకుంటూ. చివరివాళ్ళు ముగ్గురూ జరుగుతున్నది అర్థం కానీ అయోమయంలో ఉండి పోయారు. నాయుడుగారి ఆదేశాల మేరకు ఇంటి వసారాలో చాపలు పరిచి ఆడవాళ్లు కూర్చునే ఏర్పాట్లు చేశారు. మగవాళ్ళు నిల్చునే ఉన్నారు.

ఎండాకాలం అయిపోయినా ఇంకా బాగా వేడిగానే ఉంది. పైగా అందరి మనసులు ఆందోళనతో నిండి ఉన్నాయేమో మరీ ఉక్కబోస్తోంది. పార్వతీశం కేశవరావు గారి పాదాల దగ్గర నిల్చున్నాడు. ఆయన కొద్దిగా కదలటం ముందుగా గమనించింది అతడే. వెంటనే మావగారి పక్కకు వెళ్ళాడు. కేశవరావు గారు కదలటం చూసి అందరిలోనూ గుసగుసలు మొదలయ్యేయి.

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS